# ఇండియన్ పాలిటీ

## గవర్నర్

రాజ్యాంగంలో VI భాగంలో 153 – 163 వరకు ఉన్న అధికరణలు గరవ్నర్ పదవి, నియామకం, అర్హతలు, అధికారాలు – విధులు మొదలైన అంశాలను వివరిస్తాయి. వీటితోపాటు 174, 175, 176, 200, 201, 213, 217, 233, 234 అధికరణలు కూడా గవర్నర్ అధికారాలు, విధుల గురించి తెలియజేస్తాయి.

### నియామకం

రాజ్యాంగంలోని 155వ నిబంధన ప్రకారం గవర్నర్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. అయితే ఆచరణలో ప్రధానమంత్రి సూచించిన వ్యక్తిని గవర్నర్‌గా నియమించాల్సి ఉంటుంది. 153వ అధికరణ ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉంటారు.

7వ రాజ్యాంగ సవరణ చట్టం 1956 ద్వారా ఒక గవర్నర్ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా లేదా కేంద్రపాలిత ప్రాంతాలకు లెఫ్టినెంట్ గవర్నర్ లేదా చీఫ్ కమిషనర్ లేదా పరిపాలకుడిగా వ్యవహరిస్తారు. అండమాన్, పుదుచ్చేరి, దిల్లీ పరిపాలకులను లెఫ్టినెంట్ గవర్నర్లుగా, దాద్రానగర్ – హవేలీ, డీవ్, దమణ్, లక్షద్వీప్‌లకు పరిపాలకులుగా వ్యవహరిస్తారు. వాస్తవానికి వీరి అధికారాలు, విధుల్లో తేడా లేదు. బ్రిటిష్ పాలనాకాలంలో అధికారులను చీఫ్ కమిషనర్లుగా, పరిపాలకులుగా నియమించేవారు. లెఫ్టినెంట్ గవర్నర్ గవర్నర్ జనరల్ ప్రతినిధిగా వ్యవహరించేవారు.

### అర్హతలు

రాజ్యాంగంలోని 157వ అధికరణ ప్రకారం రాష్ట్ర గవర్నర్‌గా నియమించడానికి కింది అర్హతలు ఉండాలి.

ఎ. భారత పౌరుడై ఉండాలి

బి. 35 సంవత్సరాలు వయసు నిండి ఉండాలి. 158వ నిబంధన ప్రకారం కింది నిబంధనలకు లోబడి ఉండాలి.

1. పార్లమెంట్ ఉభయసభలు లేదా రాష్ట్ర శాసనసభ సభ్యుడై ఉండకూడదు. ఒకవేళ సభ్యుడై ఉన్నట్లయితే గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచి పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభ సభ్యత్వం దానంతట అదే రద్దవుతుంది.
2. లాభదాయకమైన ప్రభుత్వ పదవిలో ఉండకూడదు.

రాజ్యాంగ నిబంధనలు కాకుండా కొన్ని సంప్రదాయాలు కూడా ఉన్నాయి. అవి:

i. సొంత రాష్ట్రంలో గవర్నర్‌గా నియమించకూడదు.

ii. గవర్నర్‌గా నియమించడానికి ముందు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించాలి.

ఈ సంప్రదాయాలు రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రెండు దశాబ్దాల తర్వాత స్థిరపడ్డాయి.

### పదవీ కాలం

రాజ్యాంగంలోని 156వ అధికరణ ప్రకారం గవర్నర్ రాష్ట్రపతి సంతృప్తి మేరకు పదవిలో కొనసాగుతారు. రాష్ట్రపతి గవర్నర్ పనితీరుపట్ల సంతృప్తి కోల్పోతే, గవర్నర్ పదవి నుంచి వైదొలగాలి లేదా రాష్ట్రపతి తొలగిస్తారు. గవర్నర్ తొలగింపునకు రాజ్యాంగం ప్రత్యేకంగా ఏ పద్ధతిని పేర్కొనలేదు. గవర్నర్‌ను పదవి నుంచి తొలగించడంలో పార్లమెంట్‌కు లేదా, రాష్ట్ర శాసనసభకు లేదా, హైకోర్టుకు ఎలాంటి అధికారం లేదు. అయితే సుప్రీంకోర్టు కె.జి. బాలకృష్ణన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బి.పి.సింఘాల్ (మాజీ పార్లమెంటు సభ్యుడు) Vs యూనియన్ ఆఫ్ ఇండియా, 2010 కేసులో తీర్పు ఇస్తూ గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కాదని, గవర్నర్ పదవి రాజ్యాంగబద్ధమైందని, కాబట్టి 'రాష్ట్రపతి విశ్వాసం కోల్పోయారనే' పేరుతో ఏకపక్షంగా తొలగించకూడదని పేర్కొంది. తగిన కారణాలు (అంటే అనైతిక ప్రవర్తన, తీవ్రమైన అవకతవకలు లాంటివి) ఉన్నప్పుడే తొలగించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర గవర్నర్ పదవీకాలం ముగిసిన తర్వాత తిరిగి గవర్నర్‌గా నియమించవచ్చు. గవర్నర్ పదవీకాలం ముగిసినప్పటికీ మరొకరిని నియమించేవరకు పదవిలో కొనసాగుతారు.

## బదిలీలు

గవర్నర్ల బదిలీ గురించి రాజ్యాంగంలో పేర్కొనలేదు. అయినప్పటికీ గవర్నర్‌ను ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి బదిలీ చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బదిలీ చేస్తే బదిలీ అయిన రాష్ట్రంలో తిరిగి ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది.

## ప్రమాణ స్వీకారం

రాజ్యాంగంలోని 159 నిబంధన ప్రకారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆ పదవి ఖాళీగా ఉంటే అందరి కంటే సీనియర్ న్యాయమూర్తి గవర్నర్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాజ్యాంగం, చట్ట రక్షణ, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కృషిచేస్తానని ప్రమాణం చేస్తారు.

## రాజ్యాంగ రక్షణలు

రాజ్యాంగంలోని 361వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ విధి నిర్వహణలో కింది రాజ్యాంగ రక్షణలు పొందుతారు.

1. గవర్నర్ పదవిలో ఉండగా, విధి నిర్వహణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలకు గవర్నర్ ఏ న్యాయస్థానానికీ జవాబుదారీ కాదు.
2. గవర్నర్ పదవిలో ఉన్నంతవరకు వారిపై సివిల్ లేదా క్రిమినల్ కేసులు నమోదు చేయకూడదు, అరెస్టు చేయకూడదు.
3. సివిల్ కేసులు నమోదు చేయాలంటే కనీసం 2 నెలల ముందు నోటీసు ఇవ్వాలి.

## జీతభత్యాలు

గవర్నర్ జీతభత్యాలను నిర్ణయించే అధికారం భారత పార్లమెంట్‌కు ఉంటుంది. గవర్నర్ పదవీకాలంలో జీతభత్యాలను పెంచవచ్చు. కానీ తగ్గించే అధికారం ఎవరికీ లేదు (ఆర్టికల్ 158 (4)). జీతభత్యాలను రెండో షెడ్యూల్‌లో నిర్ణయించిన విధంగా రాష్ట్ర సంఘటిత నిధి (State Consolidated Fund) నుంచి చెల్లిస్తారు. 158(3)A ప్రకారం ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమితులైతే, రాష్ట్రపతి సూచించిన విధంగా ఆయా రాష్ట్రాల సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ఉదాహరణకు ఈ.ఎస్.ఎల్. నరసింహన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్. ఈయన జీతభత్యాలను రెండు రాష్ట్రాలు సమానంగా భరించాల్సి ఉంటుంది.

**రచయిత: డాక్టర్ ముప్పాల భాస్కర రాజు**

www.eenadupratibha.net